క్లుప్తంగా

నేడు సామాజిక బహిరంగ సభ

రామసముద్రం : రామసముద్రం స్త్రీశక్తి భవనం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ భానుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన వివిధ రకాల పనులపై రిసోర్స్ పర్సన్ గ్రామాల్లో 17వ విడత తనిఖీలు చేసి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారని తెలిపారు. దీనిపై మండలకేంద్రంలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు హాజరుకావాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నిమ్మనపల్లె: నిమ్మనపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షాలెట్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరుకానున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

21న ఉచిత కంటి వైద్య శిబిరం

మదనపల్లె : తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఈ నెల 21 ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు, వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే ఆపరేషన్లు అవసరమైన వారిని తిరుపతికి తీసుకెళ్లి, ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించి మదనపల్లెకు చేరుస్తామన్నారు. కంటి జబ్బులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరానికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ముగ్గురు ఎంపిక



జాబ్‌మేళాలలో ఎంపికైన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం

పీలేరు : స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలలో ముగ్గురు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం సీఎస్ఆర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎన్‌సీ కంపెనీ (24)7లో ఉద్యోగాలకు 70 మంది అభ్యర్థులు హాజరు కాగా వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించారు. గురువారం ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని ప్రత్యేక అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ బస్సుల వలన కలిగే ఇబ్బందులు, సమస్యలు గురించి సలహాలు, సూచనల కోసం ఈ నెల 20న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె వన్, టూ డిపో పరిధిలోని సమస్యలను ఫోన్ ద్వారా తెలపాలని సూచించారు. ఉదయం 11 నుంచి 12 గంటలకు 9959225676కు ఫోన్ చేయాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

చిన్నమండెం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఎస్.నందిని 580/600 మార్కులు, ఎస్.హుస్నా 570/600 మార్కులు, ఎస్.స్పందన 568/600 మార్కులు పదో తరగతిలో సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు.

కరువు సీమలో 'ఖర్జూర' సిరులు

ఎడారిలో పెరిగే వృక్షం ఖర్జూరం. పోషక విలువలతో కూడిన తియ్యదనం దాని సొంతం. ఈత చెట్టుని పోలి ఉండే ఈ ఖర్జూరం తెలుగు రాష్ట్రాల్లో కాయడం కష్టం. సాగు చేయడం అంటే సాహసమే. అలాంటి ఖర్జూరం.. కరువు సీమగా పేరుగాంచిన అన్నమయ్య జిల్లాలో ఖర్జూరపు సిరులు కురుస్తున్నాయి.

- విరగకాసిన ఖర్జూరం
- వాతావరణ పరిస్థితులు అనుకూలం
- ఆశాజనకంగా మొదటి పంట దిగుబడి





ఏపుగా పెరిగిన ఖర్జూరపు తోట (ఇన్‌సెట్)లో గెలకు విరగకాసిన ఖర్జూరం కాయలు

తంబళ్లపల్లె: ఏడారి ప్రాంతాల్లో సాగు చేసే ఖర్జూరం పంట గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరుకుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించి మొదటి పంట దిగుబడి ఆశాజనకంగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పరసతోపు పంచాయతీ దబ్బులగుట్టపల్లెకు చెందిన ఆర్.వెంకటరెడ్డి, ఆర్.పాపిరెడ్డి బీడు భూముల్లో ఖర్జూరం పంట సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఇసుక తెర కలిగిన భూమి అనుకూలం. మూడున్నర సంవత్సరాల క్రితం రాజస్థాన్‌లోని జయపూర్‌లో అతుల్ కంపెనీ నుంచి ఖర్జూరం మొక్కలను తీసుకువచ్చారు.

మంచి ఆదాయం

ఒక్కో మొక్క రూ.4,500తో కొనుగోలు చేశారు. మొక్కలను నాటేందుకు రూ.500 ఖర్చు వెచ్చించారు. ఒకటన్నర ఎకరాలో 110 చెట్లు, మరో ఒకటన్నర ఎకరాలో వంద చెట్లు 20 అడుగుల దూరంతో నాటారు. అవి ఏపుగా పెరిగి మూడన్నర సంవత్సరానికి కోతకు వచ్చింది. ఫిబ్రవరి నెలలో చెట్లు పూతకు వస్తాయి. తోట అంచుల్లో మొక్కలు నాటారు. వాటి పూత నుంచి పుప్పొడి సేకరించి ఆడ మొక్కల పూతకు ఒక నెల రోజులు క్రాసింగ్ చేశారు. దీంతో చెట్లు విరగకాశాయి. ఒక్కో చెట్టుకు 5 నుంచి 10 గెలలు వచ్చాయి. ప్రతి ఏడాది జూలై, ఆగస్టు నెలలో పంట కోతకు వచ్చి మంచి ఆదాయం వస్తోంది. ఒక్కో గెలకు పది కేజీల కుపైగా కాశాయి. నీటి తడి తక్కువైనా పంటకు ఇబ్బంది ఉండదు. ప్రస్తుతం కాయలు కిలో వంద నుంచి రూ.250 వరకు అమ్ముడుపోతున్నట్లు రైతులు తెలిపారు. పట్టణాలు, పల్లెల్లో విక్రయిస్తున్నామని తెలిపారు.



ఖర్జూరం కాయలు చూపుతున్న రైతు పాపిరెడ్డి

మార్కెటింగ్ సౌకర్యమే లేదు



పంట ఆశాజనంగా వచ్చినా మార్కెటింగ్ సౌకర్యంతో ఇబ్బంది పడుతున్నాం. బెంగుళూరు వంటి నగరాలకు తీసుకుపోతే రవాణా ఖర్చులు, మార్కెట్‌లో దళారుల బెడద, అధిక కమీషన్‌లు ఇవ్వాల్సి వస్తోంది. ఇటువంటి వ్యాపార పంటల సాగు చేస్తే మార్కెటింగ్ సౌకర్యం ఉంటే మంచి ఆదాయం పొందవచ్చు. –ఆర్.వెంకటరెడ్డి, రైతు, దబ్బులగుట్టపల్లి, తంబళ్లపల్లె మండలం

ప్రజాస్వామ్యానికి టీడీపీ తిలోదకాలు

మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి

కలికిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తిలోదకాలిచ్చిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి విమర్శించారు. కలికిరిలోని ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆఖరుకు సానుభూతి పరులపైనా టీడీపీ, జనసేన నేతలు దాడులకు దిగడం, బెదిరింపు చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సింది పోయి రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారన్నారు. కూటమి నేతలు దాడులు, ప్రతీకార చర్యలు ఆపకపోతే ప్రతి ఘటనలు తప్పవన్నారు. పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డిపై దాడికి దిగడం హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల వరకే పార్టీలని, ఫలితాల తర్వాత ప్రతిపక్షం, అధికారపార్టీలు రెండూ ప్రజాశ్రేయస్సు కోసం పనిచేయాలే తప్ప దాడులు, హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని సూచించారు.

ప్రజాస్వామ్యంలో దాడులు హేయమైన చర్య



సమావేశంలో మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల దాడులు హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త నిసార్‌అహ్మద్ ఆక్షేపించారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలన్నర రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ హత్యలు, అత్యాచారాలు, రాజకీయకక్షలతో దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయిందని దుయ్యబట్టారు. రెండురోజుల క్రితం తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడేందుకు ప్రయత్నించారని తెలిపారు. మదనపల్లె పార్లమెంటరీ పరిధిలోని పుంగనూరులో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పను కలిసేందుకు వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిని టీడీపీ నాయకులు అడ్డుకోవడం, రాళ్ల దాడికి పాల్పడటం, వాహనాలు ధ్వంసం చేయడం తగదని హితవుపలికారు. ప్రశాంతంగా ఉన్న పట్టణాల్లో టీడీపీ నాయకులు ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకువస్తున్నారని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల వరకే పార్టీలని, ఫలితాల తర్వాత ప్రతిపక్షం, అధికారపార్టీలు రెండూ ప్రజాశ్రేయస్సు కోసం పని చేయాలే తప్ప దాడులు, హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని సూచించారు. స్నేహపూర్వక వాతావరణంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోండి

నిమ్మనపల్లె: ప్రతి సోమ, గురువారాల్లో సచివాలయాల వారీగా అందజేస్తున్న బీసీజీ టీకాలు అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ కోరారు. గురువారం మండలంలోని అగ్రహారం, నిమ్మనపల్లె గ్రామాల్లో స్టాఫ్ డయేరియా, బీసీజీ టీకాలు, డెంగీ వ్యతిరేక మాసోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అర్హులైన ఆరు వర్గాల ప్రజలు బీసీజీ టీకాలు వేసుకోవాలని సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దేవేంద్ర, ఎఎన్ఎంలు గాయిత్రి, లీలారాణి, ఎంఎల్‌హెచ్‌పి శశికళ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనాలు సమర్పణ

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హెచ్‌పీసీఎల్‌కు సమీపంలో ఉన్న ఎల్లమ్మతల్లికి గురువారం భాకరాపేట గ్రామ ప్రజలు మొదట గ్రామంలో ఉన్న గంగమ్మకు పూజలు చేసిన అనంతరం మహిళలు బోనాలను ఎల్లమ్మ గుడివద్దకు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు, కుంకుమలతో అలంకరించారు. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు పడి రైతు పంటలు సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. అనంతరం వారి కుటుంబీకులు, బంధువులు స్నేహితులతో కలసి విందు భోజనం ఆరగించారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

పుల్లంపేట : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం ఎంపీడీఓ నరసింహమూర్తి, మండల విద్యాశాఖ అధికారులు చక్రాధర్, నాగా తిరుమలరావుల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాల్య వివాహాలు వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. మహిళలు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

రామాపురం : అన్నదానం గొప్ప పుణ్యకారమని లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో జూలుపల్లి ఫక్రుద్దీన్ ఆర్థిక సహాయంతో ఫైజా 2వ పుట్టిన రోజు సందర్భంగా గురువారం బండపల్లిలోని ప్రేమాలయంలో వృద్ధులకు అల్పాహారాన్ని అందించారు. దాతల సహకారంతో క్లబ్ తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని క్లబ్ సభ్యులు తెలిపారు.

మండే సూర్యుడు నెల్సన్ మండేలా



నెల్సన్ మండేలా చిత్రం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం: నెల్సన్ మండేలా.. మండే సూర్యుడని స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ కొనియాడారు. గురువారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెల్సన్ మండేలా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండేలా చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి ఆయన ఘననివాళులు అర్పించారు. అనంతరం ప్రభుచరణ్ మాట్లాడుతూ 1918 జూలై 18న దక్షిణ ఆఫ్రికాలో జన్మించిన నెల్సన్ మండేలా అక్కడి జాతి వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. సుమారు 32 ఏళ్ల పాటు జైలు జీవితం అనుభవించారని, 1990లో భారతరత్న పురస్కారంతో భారతదేశం మండేలాను గౌరవించిందన్నారు. స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం విలువల కోసం పోరాడిన మండేలా స్ఫూర్తిని ప్రపంచానికి చాటేందుకు ఐక్యరాజ్య సమితి జూలై 18న నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవంగా పాటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, దుర్వాసులు నాయుడు, శంకర, శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్ నాయక్, ఖదీర్ బాషా, మహబూబ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి

పీలేరు: సమిష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకులు శుభ్రం చేసి రక్షిత నీటిని అందించాలని తెలిపారు. హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిధులు కూడా ఉన్నాయని చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు హరిత, చలపతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య

మదనపల్లె సిటీ: ఖాతాదారులకు ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక సీటీఎం రోడ్డులోని బ్యాంకులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5 రాష్ట్రాల్లో 42 బ్యాంకు బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు. ఇందులో రూ.4 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మదనపల్లె బ్రాంచి 2016లో ప్రారంభించామని, అనతి కాలంలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నట్లు వివరించారు. బ్రాంచిలో గోల్డ్‌లోన్లు త్వరగా అందిస్తామన్నారు. గృహ రుణాలు, ఇంటిపై మార్టిగేజ్ లోన్లు, సకాలంలో అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ పి.ఆర్ఎస్ రాజు, ఆర్ఎం లోకనాథంనాయుడు, బ్రాంచి మేనేజర్ వి.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



లియాఫీ నూతన కార్యవర్గసభ్యులు

మదనపల్లె సిటీ: ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) జోనల్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి ప్రకటించారు. లియాఫీ మదనపల్లె బ్రాంచి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా జీవీ రమణారెడ్డి, కోశాధికారిగా ఎస్.మస్తాన్, గౌరవ అధ్యక్షుడిగా సి.రాజారెడ్డి, డివిజన్ ఈసీగా చెక్కా రామమోహన్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

పట్టణంలో పచ్చదనం పెంపొందిద్దాం

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. గురువారం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ ఎక్స్‌టెన్షన్ గజ్జెలకుంటలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మదనపల్లె పట్టణంలో రోజురోజుకీ భూగర్భజలాలు అడుగంటి పోవడం, ఆహ్లాదకర వాతావరణం కరువైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలందరూ మొక్కలు పెంచే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శ్రావణి, ఏఈ స్నేహప్రియ, బండపల్లిశిరీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి తనిఖీ

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వసతులు, సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డులన్నీ కలియదిరిగి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సిబ్బంది అంకితభావంతో రోగులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ జమున, సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు పాల్గొన్నారు.

మట్టి గణనాథులనే విక్రయించాలి

రాయచోటి అర్బన్ : రసాయన పదార్థాలు, పీఓపీలతో వినాయక విగ్రహాలను తయారుచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన పట్టణ పరిధిలోని వినాయక విగ్రహ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ పరిధిలోని రాజధాని కల్యాణ మండపం, కడప రోడ్డు, గాలివీడు రోడ్డులో విగ్రహాల తయారీ గోడౌన్‌లను పరిశీలించి విగ్రహ తయారీదారులు, సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పర్యావరణానికి నష్టం కలిగించే కెమికల్స్, పీఓపీలతో విగ్రహాలు తయారు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మట్టితో మాత్రమే విగ్రహాలను తయారుచేసి, విక్రయించాలంటూ సూచించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలో దాదాపు 2వేల మట్టిగణపతి ప్రతిమలు తయారుచేయించి ఉచితంగా ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. రాయచోటి ప్రజలు సైతం తమకు సహకరించి మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకుని, పూజలు చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునివ్వాలంటూ విజ్ఞప్తి చేశారు.

పెండింగ్‌లో బిల్లులు.. నత్తనడకన పనులు

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు నత్తనడకన సాగుతున్నాయి. చేసిన పనులకు బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి కూలీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ నుంచి డ్వామా ఉన్నతాధికారులు మండల స్థాయిలో పని చేసే క్షేత్ర, సాంకేతిక సిబ్బందితో పాటు ఏపీఓ, ఎంపీడీఓలకు సమగ్రమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతోనే కూలీలు పనులు చేసేందుకు ఆశక్తి చూపడం లేదని మండల స్థాయి సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పెద్దతిప్పసముద్రం మండలంలోనే సుమారు రూ.60 లక్షలకు పైగా బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కూలీల సంఖ్య వెయ్యికి లోపు ఉండటం గమనార్హం.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



వాల్మీకిపురం: అవగాహన కల్పిస్తున్న జడ్జి గురు అరవింద్



తంబళ్లపల్లె: అవగాహన ర్యాలీలో న్యాయవాది, పోలీసులు



పీలేరు రూరల్ : హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: రోడ్డుపై ప్రయాణించే ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, ప్రమాదం జరిగినప్పుడు అది ప్రాణ రక్షణ కల్గిస్తుందని వాల్మీకిపురం జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి గురు అరవింద్ సూచించారు. గురువారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో న్యాయవాదులు, పోలీసులు సంయుక్తంగా కోర్టు నుంచి గాంధీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హక్కులు, చట్టాలపై జడ్జి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్, ఏజీపీ అశోక్ కుమార్ రెడ్డి, న్యాయవాదులు విభాకర్ రెడ్డి, రమణ, ఎస్సై కృష్ణమూర్తి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

తంబళ్లపల్లె: ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు రక్షించుకోవాలని న్యాయవాది గఫార్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్ సూచించారు. గురువారం పోలీసుస్టేషన్ వద్ద మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులతో వన్ కే వాక్ నిర్వహించారు. హెల్మెట్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

పీలేరు రూరల్ : ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం పీలేరు పట్టణంలో హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్, న్యాయవాదులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ద్విచక్రవాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని కోరారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని హెచ్చరించారు. హెల్మెట్ విధిగా ధరించాలని, లేకుండా చట్టపరంగా శిక్షార్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ ఎంపీఐ విజయకుమారి, ఎస్ఐ నరసింహుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సి. పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.